మీకు తెలుసా?

**తెలంగాణ వ్యవసాయ రంగ ఆదాయం**

| 2014 – 15లో | 2022 – 23లో |
|---|---|
| ₹ 41,706 కోట్లు | ₹ 1,08,269 కోట్లు |




ఇదిరా.. తెలంగాణ మాడల్!

బిగ్ స్టోరీ

## అభివృద్ధి, సంక్షేమం సాకారమైంది..

నీళ్లు లేక నోళ్లు తెరిచిన బీళ్లు.. దినదిన గండంగా గడిచిన బతుకులు.. వెరసి ఆకలిచావులు, వలసలు.. ఇదీ తొమ్మిదిన్నర ఏండ్ల కిందట తెలంగాణ బతుకు చిత్రం! ఇప్పుడు మండువేసవిలోనూ మత్తడి దుంకుతున్న చెరువులు.. ఎటు చూసినా పుట్లకొద్దీ ధాన్యం రాశులు.. కొత్త గా చిగురు తొడిగిన పల్లెలు!! వెనుకబాటుతనాన్ని చెరిపివేస్తూ నూతన చరిత్రను లిఖించుకునే దిశగా ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు తనదైన చతురతతో ఓ 'పథకం' ప్రకారం చేసిన వ్యూహరచనలెన్నో దేశం మొత్తానికీ అభివృద్ధి పాఠాలు బోధిస్తున్నాయి. తెలంగాణ సర్కారు అమలు చేస్తున్న సంస్కరణలు, పథకాలపై పలు సందర్భాల్లో వివిధ రంగాల ప్రముఖులు ప్రశంసలు కురిపించారు. అంతేనా, పలు రాష్ట్రాలు అధ్యయనం చేసి తామూ ఆచరిస్తున్నాయి. మరికొన్ని రాష్ట్రాలు ఆ దిశగా అడుగులేస్తున్నాయి.



# పథకం ప్రకారమే!



- వినూత్నం.. విప్లవాత్మకం.. అనుసరణీయం
- కేసీఆర్ తెచ్చినవన్నీ దేశం మెచ్చిన పథకాలే
- ప్రతిపక్షాలూ ప్రశంసించిన సందర్భాలెన్నో!
- ప్రముఖులు మెచ్చిన తెలంగాణ పథకాలు బోలెడు
- తెలంగాణ బాటలో కేంద్రం, ఇతర రాష్ట్రాలు

...మ్యాకం రవికుమార్

పేదల, బడుగు బలహీనవర్గాల సంక్షేమానికి తెలంగాణ సర్కారు చిరునామాగా నిలుస్తున్నది. రాష్ట్ర ఆవిర్భావం నుంచీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎప్పటికప్పుడు విప్లవాత్మక పథకాలకు శ్రీకారం చుడుతూ సబ్బండ వర్గాల సంక్షేమానికి కొత్త బాటలు వేస్తున్నారు. సంక్షేమ రంగంలో వినూత్న సంస్కరణలకు నాంది పలికారు. తెలంగాణ ప్రభుత్వం గడిచిన తొమ్మిదిన్నర ఏండ్లలో దేశంలో ఎక్కడాలేని విధంగా, గతంలో ఏ రాజకీయ పార్టీ చేపట్టని విధంగా, కనీవినీ ఎరుగని రీతిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, అనాథలు, లింగమార్పిడి వ్యక్తులు ఇలా సమాజంలోని ప్రతి వర్గానికీ ఏదో ఒక లబ్ధి చేకూర్చే పథకాలను రూపొందించి అమలు చేస్తున్నారు. రాష్ట్రాన్ని విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో నూతన ఆవిష్కరణలకు చిరునామాగా మార్చారు. రైతుబంధు, రైతు బీమా, కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, గురుకుల విద్యాలయాలు, ఉచిత విద్యుత్తు, గొర్ల పంపిణీ, చేపల పంపిణీ, దళితబంధు, గృహలక్ష్మి, బీసీలకు లక్ష సాయం, మైనార్టీలకు లక్ష సాయం.. ఇలా చెప్పుకుంటే ఎన్నో సంక్షేమ పథకాలు ఉదాహరణగా నిలుస్తాయి.

### ఒక పథకం.. బహుముఖ ఫలితాలు

కేసీఆర్ తెచ్చిన పథకాలన్నీ ఆయా వర్గాలకు లబ్ధి చేకూర్చడంతోపాటు పరోక్షంగా రాష్ట్ర ప్రగతికి దోహదపడుతున్నాయి. ప్రతి పైసాకు రెట్టింపు ప్రతిఫలం దక్కుతున్నది. ఆసరా పింఛన్లతో వయోవృద్ధులు, దివ్యాంగులకు ఆర్థిక భరోసా దక్కి కుటుంబంలో ఆదరణ పెరిగింది. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌తో బాల్యవివాహాలకు అడ్డుకట్ట పడింది. మాతాశిశు మరణాల రేటు కూడా గణనీయంగా తగ్గిపోయింది. గొర్రెలు, చేపల పంపిణీతో గొల్లకుర్మలు, మత్స్యకారుల జీవన ప్రమాణాలు పెరిగాయి. రాష్ట్రంలో మాంసం, చేపల ఉత్పత్తి భారీగా పెరిగింది. గురుకుల విద్యాలయాల స్థాపన ద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల విద్యార్థులకు నవశకం మొదలయ్యింది. డ్రాపౌట్స్ తగ్గి ఉన్నత చదువులు చదివే బాలికల సంఖ్య పెరిగింది. మైనార్టీ బాలికల విద్యలో దేశంలోనే తెలంగాణ నం.1గా నిలవటం గమనార్హం. మిషన్ కాకతీయ ద్వారా నీటినిల్వ సామర్థ్యం పెరిగింది. దాంతో భూగర్భజలాలు పెరిగాయి. రెండు పంటలకు భరోసా ఏర్పడి, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు మెరుగయ్యాయి. దళితబంధు నిరుపేద దళితుల్లో కొత్త కాంతులను నింపుతున్నది. కూలీలను ఓనర్లుగా మార్చుతున్నది. ఇలా ప్రతి పథకం ఆశించిన స్థాయికి మించి సత్ఫలితాలను ఇస్తున్నది.

### సాగునీటి పథకాలకు అంతర్జాతీయ ఖ్యాతి

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సాగునీటి పథకాలకు అంతర్జాతీయ ఖ్యాతి లభిస్తున్నది. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకంగా రికార్డులకు ఎక్కింది. అమెరికాలోని మిచిగాన్ యూనివర్సిటీ, చికాగో యూనివర్సిటీ విద్యార్థులు, శ్రీలంకలోని ఇంటర్నేషనల్ వాటర్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులు అధ్యయనం చేసి, దాని విశిష్టతలను ప్రపంచానికి చాటారు. నీతిఆయోగ్, నాబార్డ్, ఇక్రిసాట్, సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్, తదితర జాతీయ, అంతర్జాతీయ సంస్థలు సైతం రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై అధ్యయనం చేసి భేష్ అని కితాబిచ్చాయి. వైద్యారోగ్యం, ఇంటింటికీ నల్లాల ద్వారా శుద్ధజలాలను అందించటంలో తొలిస్థానంలో నిలిచిన తెలంగాణ.. పచ్చదనం, పరిశుభ్రతలోనూ ముందు వరుసలోనే నిలిచి దాదాపు 75కు పైగా అవార్డులను సొంతం చేసుకున్నది.

### దేశం అనుసరిస్తున్నది



రాష్ట్ర ప్రభుత్వ పథకాలు యావత్తు దేశానికి స్ఫూర్తిగా నిలుస్తున్నాయి. రైతుబంధు దేశవ్యాప్తంగా అత్యంత ఆదరణ పొందింది. ఆ పథకాన్ని కేంద్రం ఆదర్శంగా తీసుకుని పీఎం కిసాన్ సమ్మాన్ నిధిని ప్రకటించింది. ఒడిశాలోనూ కాలియా పేరుతో ఈ పథకాన్ని అమలుచేస్తున్నారు. పశ్చిమబెంగాల్‌లో రైతుబంధు, రైతుబీమాను అమలుచేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పేర్లు మార్చి అమలుచేస్తున్నది. మిషన్ కాకతీయ, కల్యాణలక్ష్మి, రుణమాఫీ, టీ–హబ్, అన్నపూర్ణ, టీఎస్ఐపాస్‌ను అమలు చేస్తామని కర్ణాటక ఎన్నికల్లో అక్కడి బీజేపీ ప్రకటించింది. రైతులు, మహిళల కోసం తెలంగాణ పథకాలను మరికొన్ని రాష్ట్రాలు ప్రవేశపెట్టేందుకు సిద్ధమయ్యాయి. మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, బీహార్, తమిళనాడు, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలు మన సంక్షేమ పథకాలను స్ఫూర్తిగా తీసుకుంటున్నాయి. ఇటీవలే మధ్యప్రదేశ్ ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని కాపీ కొట్టి హర్‌ఘర్ నల్–హర్‌ఘర్ జల్ పథకాన్ని ప్రారంభించింది. బీసీలకు లక్ష సాయాన్ని కూడా కాపీ కొట్టిన కేంద్రం.. విశ్వకర్మ పేరిట అమలు చేస్తున్నది.

## అన్ని వర్గాల నుంచి ప్రశంసలు

తెలంగాణ పథకాలకు విమర్శకుల నుంచీ ప్రశంసలు దక్కాయి. ప్రధాని మోదీ మొదలుకొని మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, కేంద్రమంత్రులు, వివిధ రాష్ట్రాల మంత్రులు, అధికారులు, ప్రముఖ నిపుణులు, ఆర్థిక, వ్యవసాయ, సామాజికవేత్తలు మన పథకాలను వేనోళ్ల పొగిడారు. ప్రధాని మోదీ పార్లమెంటులో, మన్ కీ బాత్‌లో తెలంగాణ అభివృద్ధిని ప్రస్తావించారు. మిషన్ భగీరథ భేష్ అని కితాబిచ్చారు. కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖమంత్రి అనంతకుమార్ హెగ్డే, కేంద్ర సామాజికన్యాయ, సాధికారత సహాయమంత్రి రాందాస్ అథవాలే, ఎస్ఎస్ అహ్లూవాలియా, ముక్తార్ అబ్బాస్ నఖ్వీ, హర్షవర్ధన్, కిరణ్ రిజిజు, నరేంద్రసింగ్ తోమర్ తదితరులు సందర్భం వచ్చిన ప్రతిసారీ తెలంగాణ పథకాలపై ప్రశంసలు కురిపించారు.



### రాష్ట్ర పథకాలపై విస్తృత అధ్యయనాలు

- మిషన్ భగీరథపై 9 రాష్ట్రాలు
- షీ టీం వ్యవస్థపై బెంగాల్ ప్రభుత్వం
- కంటివెలుగుపై ఒడిశా
- గొర్రెల పంపిణీపై తమిళ నాడు, మహారాష్ట్ర, కర్ణాటక
- సాగు విధానాలపై రాజస్థాన్, మహారాష్ట్ర, పంజాబ్
- గురుకుల విద్యావ్యవస్థపై బీహార్
- పౌరసరఫరాల సంస్కరణలపై తమిళ నాడు, ఛత్తీస్‌గఢ్, పంజాబ్, ఉత్తరప్రదేశ్, శ్రీలంక
- ఇసుక పాలసీపై పంజాబ్

తెలంగాణ పథకాలను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకోవాలి.

- కాగ్, నీతిఆయోగ్

NITI Aayog

తెలంగాణ మున్సిపల్ శాఖ ఏర్పాటు చేసిన మున్సిపల్ నాలెడ్జ్ సెంటర్ అద్భుతం. పట్టణాలపై అధ్యయనం, పరిశోధన చేసేవారికి, నిపుణులకు అవసరమైన సమాచారమంతా ఒకేచోట లభించేందుకు ఈ నాలెడ్జ్ సెంటర్ ఎంతగానో తోడ్పడుతుంది.

- నీతి ఆయోగ్



మిషన్ కాకతీయ అద్భుతమైన పథకం. తెలంగాణ కృషిని యావత్తు దేశానికి చాటాలని సంకల్పించా.

- వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా, రామన్‌మెగసెసే అవార్డు గ్రహీత డాక్టర్ రాజేంద్రసింగ్



తెలంగాణ పారిశ్రామిక విధానం గొప్పగా ఉన్నది. ఎన్నో ఏండ్ల నుంచి పారిశ్రామిక వేత్తగా ఉన్న తాను ఇలాంటి పారిశ్రామిక విధానాన్ని ఎక్కడా చూడలేదు.

- రతన్ టాటా



భూరికార్డుల ప్రక్షాళన, కేసీఆర్ కిట్లు, భారీ ఎత్తిపోతల పథకాలు, రైతుబంధు వంటి పథకాలు దేశానికి ఆదర్శం. వాటిపై అధ్యయనం చేసి దేశమంతా అమలు చేయాలి. పార్టీలు, వ్యక్తులకు అతీతంగా తనదైన పాలనతో కేసీఆర్ అన్ని వర్గాల మనసులను దోచుకున్నారు. తెలంగాణను దేశానికి మార్గదర్శిగా నిలిపారు.

- మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణ్యన్

# ఇండియాకు ఇండస్ట్రీ హబ్ తెలంగాణ

మొదటిపేజీ తరువాయి..

**తెలంగాణలో పారిశ్రామికరంగం పురోగతి ఎలా ఉన్నది?**

ప్రభుత్వ ప్రోత్సాహంతో తెలంగాణలో పారిశ్రామికరంగం దూకుడుగా ముందుకు సాగుతున్నది. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చొరవతో ఇది సాధ్యమైంది. నేను సీతారాంపూర్ ఇండస్ట్రియల్ పార్క్‌ను సందర్శించినప్పుడు.. చుట్టూ ఉన్న ప్రాంతం ఐటీ కంపెనీలు, ఇతర పరిశ్రమలతో బుక్ అయిందని, మాకు అవసరమైనంత భూమి లేదని చెప్పారు. అక్కడికి 8 కి.మీ.ల దూరంలోని ప్రాంతాన్ని ఖరారు చేశాం. నేను ఇక్కడ ఎన్నో ఇండస్ట్రియల్ పార్క్‌లను చూశాను. రానున్న రోజుల్లో తెలంగాణ దేశంలోనే ఇండస్ట్రియల్ హబ్‌గా మారుతుందనడంలో సందేహం లేదు. దక్షిణాదిలో తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో భారీ సర్వే చేశాం. పెట్టుబడులకు అత్యుత్తమ రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది.

**ఈ ప్రగతి ఎలా సాధ్యమైందని మీరు భావిస్తున్నారు?**

ఈ పదేండ్లలో పారిశ్రామికరంగం మాత్రమే కాదు వ్యవసాయం, మౌలిక సదుపాయాలు ఇలా ఏ రంగం తీసుకున్నా తెలంగాణ అద్భుతమైన వృద్ధి సాధించింది. ఇది ఇతర రాష్ట్రాల రాజకీయ నాయకులకు కనువిప్పులాంటిది. కేసీఆర్, కేటీఆర్ లాంటి బలమైన నాయకత్వం లేకుంటే ఇంత వృద్ధి సాధించడం అసాధ్యం. రాష్ట్ర పురోగతికి ఇక్కడి రాజకీయ స్థిరత్వం ప్రధాన కారణం. కర్ణాటకనే తీసుకోండి.. మొన్నటి దాకా బీజేపీ, ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలో ఉన్నాయి. తమిళనాడులోనూ ఐదేండ్లకోసారి ప్రభుత్వం మారుతుంటుంది. కేరళలోనూ ఎప్పుడైనా.. ఏదైనా జరగొచ్చు. నా అంచనా ప్రకారం మరో పదేండ్ల వరకు తెలంగాణలో ఎలాంటి మార్పు ఉండదు. ఏ పరిశ్రమకైనా మొదటి పదేండ్లు చాలా కీలకం. సంస్థ కుదురుకునే వరకు ఎలాంటి రాజకీయ అస్థిరత ఉండకూడదు. అందుకే ఇన్వెస్టర్లు రాజకీయ సుస్థిరతకు అంత ప్రాధాన్యం ఇస్తారు. తెలంగాణ రాజకీయ స్థిరత్వంతోపాటు మంచి వర్కర్స్ ఉన్నారు. ఇక్కడి ప్రజలు స్నేహశీలురు. ముఖ్యంగా రాష్ట్రంలో శాంతిభద్రతలకు ఢోకా లేదు.



### పత్తి రైతుకు దన్ను

తెలంగాణ పత్తి ఉత్పత్తిలో మూడోస్థానంలో ఉన్నది. ఇక్కడి కాటన్ మేలి రకం. దురదృష్టం ఏంటంటే.. గుజరాత్, తమిళనాడు తరహా వస్త్ర పరిశ్రమలు, స్పిన్నింగ్ మిల్లులు లేక ఇక్కడి కాటన్‌కు గుర్తింపు రావడం లేదు. ఇక్కడ అధ్యయనం తర్వాత కాటన్ ప్రాసెస్‌ను మెకనైజింగ్ చేయాలనుకున్నాం. ప్రస్తుతం మ్యాన్యువల్‌గా జరుగుతున్నది. ఈ విషయం రైతులతో, మంత్రి కేటీఆర్‌తో చర్చించాను. రైతులకు మంచి ధర ఇప్పించాలని కేటీఆర్ అనుకుంటున్నారు. దీని వల్ల కాటన్ ఉత్పత్తి పెరగడమే కాకుండా తక్కువ ఖర్చుతో ప్రాసెసింగ్ అవుతుంది. తెలంగాణలో ఉత్పత్తి అవుతున్న కాటన్‌లో 12–15శాతం వరకు మేం వినియోగించుకుంటాం. తద్వారా రైతులకు ప్రయోజనం కలుగుతుంది.

**తెలంగాణలో అన్ని రంగాలకూ నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నారు! ఇతర రాష్ట్రాల్లో పరిస్థితులు ఎలా ఉన్నాయి?**

విద్యుత్ సరఫరా, నీటి వసతి పరిశ్రమలకు చాలా అవసరం. కరెంటు సరిగ్గా రాకపోతే ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది. తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాలు కరెంట్ సమస్యను ఎదుర్కొంటున్నాయి. ఇక్కడ ఆ సమస్య లేదు. మేం ఏర్పాటు చేస్తున్న పరిశ్రమలకు రెండు లైన్ల నుంచి కనెక్షన్లు ఇచ్చారు. ఒక లైన్ ఫెయిల్ అయినా ఇబ్బంది రావొద్దని స్టాండ్‌బై కనెక్షన్ ఇచ్చారు. 24 గంటల విద్యుత్ సరఫరా పారిశ్రామికవేత్తలకు, కార్మికులకు ప్రయోజనం. మున్సిపల్ నీటితోపాటు మూడు రకాల నీటి వనరులు సమకూర్చారు.

**ఇతర పారిశ్రామికవేత్తలతో మీరు భేటీ అవుతుంటారు కదా! తెలంగాణలో మీ అనుభవాలను ఎవరితోనైనా పంచుకున్నారా?**

ఇంతమంచి ఆతిథ్యం గురించి చెప్పకుండా ఎలా ఉంటాను! నాకు తెలిసిన పారిశ్రామికవేత్తలను తెలంగాణకు రావాలని చెప్పాను. దుబాయ్‌కి చెందిన ఫైర్ ఎక్విప్‌మెంట్, ఫైర్ ఇంజన్ల తయారీ సంస్థ న్యాఫ్కో ప్రతినిధులను ఇక్కడ ఇన్వెస్ట్ చేయాల్సిందిగా కోరాను. వారు ఇప్పటికే రూ.1,000 కోట్లు పెట్టుబడి పెడుతున్నారు. ఇన్వెస్ట్‌మెంట్ పెంచాలని చెప్పాను కూడా! రూ.3,000 కోట్లకు పెంచే అవకాశం ఉంది. అమెరికా, కువైట్ తదితర ప్రాంతాల్లోని బిజినెస్ పీపుల్‌కూ చెప్పాను. ఎన్నికల తర్వాత వాళ్లు ముందుకువచ్చే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వంపై ఎంతో నమ్మకం ఉంటేగానీ లులూ కంపెనీ ముందుకురాదు! బీఆర్ఎస్ ప్రభుత్వం పారిశ్రామిక విధానాలు ఇలాగే కొనసాగిస్తే దేశంలో పెట్టుబడులకు తెలంగాణ గమ్యస్థానంగా ఎదుగుతుంది అనడంలో సందేహం లేదు.

### ఎక్కడికో వెళ్లడం ఎందుకు?

సీతారాంపూర్‌లో 250 ఎకరాల్లో, వరంగల్‌లో 185 ఎకరాల్లో పరిశ్రమలు నెలకొల్పుతున్నాం. విద్యుత్, నీరు తదితర మౌలిక సదుపాయాలు, ముడిసరుకు, కార్మికులకు తెలంగాణలో కొదవలేదు. అంతే కాదు, పారిశ్రామికవేత్తలకు కావాల్సిన అన్ని వస్తువులు బాయిలర్, కంట్రోల్ ప్యానల్స్, కేబుల్స్, ట్రాన్స్‌ఫార్మర్లు, సిమెంట్, స్టీల్ తదితర అన్నిరకాల వస్తువులు ఇక్కడే తయారవుతున్నాయి. ఇన్ని సౌకర్యాలు ఇక్కడ ఉన్నాక వేరే ప్రాంతానికి నేను ఎందుకు పోవాలి?

**ఇక్కడి సింగిల్‌విండో విధానానికి, ఇతర రాష్ట్రాల్లో పరిస్థితులకు వ్యత్యాసం?**

ప్రతి రాష్ట్రంలో సింగిల్ విండో అని చెబుతారు కానీ, దాని వెనుక 100 విండోలు ఉంటాయి. తెలంగాణ మాత్రం ఒక్కటే సింగిల్ విండో ఉంటుంది. ప్రభుత్వం విధానాలు పక్కాగా అమలు చేయడం వల్లే ఇది సాధ్యమైంది. మూడునాలుగేండ్లుగా తెలంగాణ వేగంగా అభివృద్ధి సాధిస్తున్నది. కేసీఆర్, కేటీఆర్ ఉన్నంత వరకు ఇది ఇలాగే కొనసాగుతుందని బలంగా నమ్ముతున్నాను.